COMMUNIST PARTY OF INDIA (MARXIST)
Telangana State Committee
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 Email-cpimtelangana@gmail.com

తేది: 02.11.2026
హైదరాబాదు

శ్రీ ఎనుమల రేవంత్‌రెడ్డి గారు
గౌరవ ముఖ్యమంత్రి గారు
తెలంగాణ ప్రభుత్వం,
హైదరాబాదు.

ప్రచురణార్థం/ ప్రసారార్థం: ఎల్‌నినోపై ముఖ్యమంత్రికి రాసిన లేఖను పంపుతున్నాము.

విషయం: ఎల్ నినో ప్రభావం – తెలంగాణ రాష్ట్రాన్ని మొత్తం కరువు ప్రాంతంగా ప్రకటించి, తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ...

రాష్ట్రంలో ఎల్ నినో (El Nino) ప్రభావం వల్ల తీవ్రమైన కరువు నేపథ్యంలో, వ్యవసాయ రంగం మరియు ప్రజల జీవనాధారం తీవ్ర సంక్షోభంలో పడ్డాయి. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో (G.O.Ms.No.03, తేదీ: 24.10.2026) ప్రకారం రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని 365 మండలాలను (111 తీవ్ర కరువు, 254 మధ్యస్థ కరువు) అధికారికంగా కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. కానీ రాష్ట్ర వ్యాపితంగా అన్ని మండలాల్లో ఈ కరువు ప్రభావం ఉన్నది. పట్టణాల ప్రజలపై కూడా ప్రభావం వున్నందున తక్షణమే రాష్ట్రంలోని మొత్తం మండలాలను, పట్టణాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి.

వర్షాభావ పరిస్థితుల వల్ల నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి కీలక ప్రాజెక్టులలో నీటి మట్టాలు ప్రమాదకర స్థాయిలో పడిపోయాయి. భూగర్భ జలాలు ఇంకిపోతుండటంతో సాగునీరు, తాగునీరు మరియు విద్యుత్ ఉత్పత్తికి ప్రమాదం ఏర్పడుతోంది. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రతరమవుతున్నది. పశువులకు తాగునీరు, పశుగ్రాసం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పంట నష్టాలను అంచనా వేసి వాణిజ్య పంటలకు ఎకరాకు రు.50వేలు, ఇతర పంటలకు రు.30వేలు రైతులకు చెల్లించాలి.

మరోవైపు బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు కేజీ రూ.100ల వరకు పెరిగాయి. దీనికి తోడు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాబట్టి తెల్లరేషన్‌కార్డుదారులందరికీ 15రకాల సరుకులను ఉచితంగా అందించాలి. పెరుగుతున్న నిత్యావసరాల ధరలను అరికట్టి మధ్యతరగతి వారికి కూడా రేషన్ షాపుల ద్వారా సబ్సిడీపై సరుకులను అందించాలి.

దీనికితోడు తాగునీటి కొరత వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం క్షీణించి అంటురోగాలు, వడదెబ్బ బారినపడే ప్రమాదం ఉంది. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజలను ఆదుకోవడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత.

కాబట్టి, ఈ పరిస్థితిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి కరువు నివారణ ప్రణాళికను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ కోరుతున్నది.

1) కరువు ప్రకటన - పరిహారం:

- **కరువు మండలాల విస్తరణ:** ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కేవలం 365 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రం మొత్తం కరువుబారిన పడింది. కాబట్టి రాష్ట్రం మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించాలి.
- **పంట నష్టపరిహారం & ఇన్‌పుట్ సబ్సిడీ:** ఏయే పంటల నష్టం ఎన్ని ఎకరాల్లో జరిగింది? దీనిపై స్పష్టమైన అంచనా వేయాలి. నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50వేలు, ఇతర పంటలకు రూ. 30,000 నష్టపరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో (DBT ద్వారా) జమ చేయాలి.
- **రుణమాఫీ:** రైతులు, డ్వాక్రా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇచ్చిన రూ. 2 లక్షల లోపు పంట రుణాలు మరియు అన్ని రకాల రుణాలను మాఫీ చేయాలి. డ్వాక్రా రుణాలపై ఒక సంవత్సరం పాటు వడ్డీ రహిత మారటోరియం ప్రకటించాలి.
- డ్వాక్రా మహిళలకు ప్రతి గ్రూపునకు వడ్డీలేని రుణాలు పూర్తి స్థాయిలో ఇవ్వాలి.
- **రైతు భరోసా:** ప్రస్తుతం పంటలు వేయని స్థితిలో వున్న రైతులకు కూడా రైతు భరోసాను, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి స్కీంను వర్తింపజేయాలి. 5 ఎకరాల లోపు ఉన్న రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతు

(త్రిప్పిచూడండి..)

భరోసాను రెట్టింపు చేసి ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ నిధులను కూడా రెట్టింపు చేసి ఇచ్చే విధంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలి. రైతు భరోసా కింద కౌలు రైతులకు ఎకరాకు రు.15వేలు ఆర్థిక సహాయం అందించాలి.

2) ఆహార భద్రత, ఉచిత రేషన్ కిట్ & ధరల నియంత్రణ:

- **రేషన్ కోటా పెంపు:** ప్రస్తుతం ఇస్తున్న సన్నబియ్యం కోటాను ఒక వ్యక్తికి 6కేజీల నుండి 12కేజీలకు పెంచాలి.
- **ఉచిత కరువు ఉపశమన కిట్:** తెల్ల రేషన్‌కార్డుదారులకు (1)బియ్యం (2)కందిపప్పు (3)గోధుమపిండి (4) వంటనూనె (5) చింతపండు (6) మినపప్పు (7) చక్కెర (8) టీపొడి (9) కారం (10) ఉప్పు (11) పసుపు (12) పాలు (13) గుడ్లు (14) కొబ్బరి నూనె వంటి 14 రకాల సరుకులను పూర్తి ఉచితంగా రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేయాలి. రేషన్ షాపులు నెలంతా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలి.
- **ధరల అదుపు:** బియ్యం, నిత్యావసరాలను అక్రమ నిల్వలు చేయకుండా చర్యలు తీసుకోవాలి. పెరుగుతున్న ధరలను అరికట్టాలి. మధ్యతరగతి వారికి కూడా రేషన్‌షాపుల ద్వారా సబ్సిడీ ధరలకు ఈ నిత్యావసరాలు అందించాలి.
- **ఉచిత భోజన కేంద్రాలు:** గ్రామ పంచాయతీల పరిధిలో పేదలు, వృద్ధుల కోసం ఉచిత రాగి జావ, మజ్జిగ ఇచ్చే "భోజన కేంద్రాలు" ప్రభుత్వం ప్రారంభించాలి.

3) సాగునీరు, ఆరుతడి పంటలు & ఉచిత విత్తనాలు/ఎరువులు:

- **ఆరుతడి పంటలు** వేయాలని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, ఏఏ ప్రాంతాల్లో ఏ పంటలు వేయాలో నిర్దిష్టంగా మార్గదర్శకాలివ్వాలి. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పంట్లు, కూరగాయలు, తదితర పంటలసాగుకు ప్రాంతాల వారీగా మార్గదర్శకాలు విడుదల చేయాలి. కోతులు ఉన్న ప్రాంతాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని సాగు నిర్ణయం జరగాలి.
- ఆరుతడి పంటలు వేసే రైతులకు ఎరువులు, విత్తనాలు మరియు పురుగు మందులను ఉచితంగా అందించాలి. మద్దతు ధరను ప్రకటించి, మార్కెట్ సౌకర్యం కల్పించాలి. బిందు/తుంపర సేద్యానికి (Drip/Sprinkler) 90 శాతం సబ్సిడీలను పెంచాలి.

4) ఉచిత విద్యుత్:

- వ్యవసాయ బోర్లకు తక్కువ విద్యుత్ ఇస్తూ, లో-వోల్టేజ్ మరియు అప్రకటిత కోతలు విధిస్తుండటం వల్ల పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు. పంటలను కాపాడుకోవడానికి నాణ్యమైన 3-ఫేజ్ విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలి. అలాగే గృహాలకు, పరిశ్రమలకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలి.
- పీఎం కుసుం -2 మరియు సూర్యాఘర్ (సోలార్) పథకాలను రాష్ట్ర వ్యాపితంగా విస్తరింపజేయాలి. ఆఫ్ గ్రిడ్ బ్యాటరీ ఫవర్‌ను సబ్సిడీని ప్రోత్సహించాలి.

5) ఉపాధి హామీ (VB-G RAM G) & కూలీల సంక్షేమం:

- వలసలను నివారించడానికి ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచాలి. కూలీల బకాయిలను ప్రతి వారం చెల్లించాలి. రోజు కూలి రు.800లు పెంచాలి. కొత్తగా జాబ్ కార్డులు ఇవ్వాలి. ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరింపజేయాలి. ఉపాధి హామీలో ఆన్‌లైన్ ఫోటో పద్ధతిని రద్దు చేయాలి. పని ప్రదేశాల్లో టెంట్లు, మజ్జిగ, సురక్షిత తాగునీరు, ఓఆర్ఎస్ కిట్లు, రవాణా సౌకర్యం కల్పించాలి.
- ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో వరద కట్టలు, చెక్‌డ్యామ్‌లు, కుంటలు, చెరువుల పూడికలు, పంట కాల్వల రిపేర్లు చేయించాలి. ఇంకుడు గుంతలు, వ్యవసాయ క్షేత్రాల్లో ఫాంపౌండ్స్‌ను నిర్మించుకోవడానికి అవకాశం కల్పించాలి.
- ఉపాధి హామీ పథకానికి 100% నిధులు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.
- రైతు భరోసా స్కీం క్రింద వ్యవసాయ కూలీలకు ప్రతియేటా రూ.12,000 ఆర్థిక సహాయం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి.

6) తాగునీటి భద్రత & పశుగ్రాస రక్షణ:

- **మంచినీటి వనరులు:** గ్రామాల్లో మూలనపడ్డ బోరు బావులు, ట్యాంకులు, తదితరాలను తక్షణమే పునరుద్ధరించాలి. అవసరమైతే పైవేట్ వ్యవసాయ బోరుబావులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, వారికి పరిహారం చెల్లించి ఉ చితంగా సురక్షిత క్లోరినేటెడ్ నీటిని అందించాలి.
- **పశుగ్రాస కేంద్రాలు:** పశువులు, గొర్రెలు, మేకలు, తదితర జంతువుల దాహార్తిని తీర్చడానికి తాగునీటి తొట్లు, ఉచిత పశుగ్రాస కేంద్రాలు నిర్వహించాలి. పాల సేకరణ ధరలు పెంచాలి.

(త్రిప్పిచూడండి..)

7) సామాజిక భద్రత & పింఛన్లు(Social Security Pensions):

- **సామాజిక పింఛన్ల క్రమబద్ధీకరణ:** కరువు కాలంలో పేద కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు వికలాంగులకు నెలకు రు.6000లు మరియు వృద్ధులకు, ఒంటరి మహిళలకు మరియు ఇతర లబ్ధిదారులకు రు.4000లు చేయూత పింఛన్లను (ఆసరా పింఛన్లు) పెంచి ఇవ్వాలి.

8) ప్రజారోగ్యం, విద్యార్థుల సంక్షేమం & ఉపాధి శిక్షణ:

- **ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHC):** పీహెచ్‌సీల్లో అవసరమైన పూర్తిస్థాయి సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచాలి. గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి.
- **విద్యార్థుల సంక్షేమం:** సెలవు రోజుల్లో కూడా గ్రామ/ బస్తీ బడుల్లో మధ్యాహ్న భోజనం (పాలు, గుడ్లు, రాగి జావతో) అందించాలి. ఫీజుల బకాయిల పేరుతో విద్యార్థుల సర్టిఫికేట్స్ నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలి. ఫీజు రియింబర్స్‌మెంట్స్‌ను విడుదల చేయాలి. పేద విద్యార్థుల అన్ని రకాల ఫీజులను ప్రభుత్వమే భరించాలి.
- **ఉచిత నైపుణ్య శిక్షణ:** గ్రామీణ యువతీ యువకులకు ప్రభుత్వ/CSR నిధులతో టైలరింగ్, కంప్యూటర్ వంటి కోర్సులకు ఉచితభోజన, వసతి, స్టైపెండ్‌తో శిక్షణ ఇవ్వాలి. నిరుద్యోగ భృతి చెల్లించాలి.

9) పారిశ్రామిక కార్మికులను ఆదుకోవాలి

- ఎల్‌నినో ప్రభావం కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతుంది. అధిక ధరలను కార్మికులు తట్టుకునేలా డి.ఎ.వర్తించే పారిశ్రామిక కార్మికులతో పాటు ఇప్పటివరకు డి.ఎ. వర్తించని కార్మికులందరికీ వర్తింపజేయాలి. ఉపాధి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ పని కల్పించాలి. కార్మికులందరికీ నెలకు చెల్లించే వేతనంతో పాటు 'ఎల్ నినో భృతి'గా 50 శాతం అదనంగా చెల్లించాలి. అన్నిరకాల కార్మికులకు కనీస వేతనాలు ప్రతి నెల మొదటి వారంలోనే చెల్లించాలి.

10) ఆదివాసీ గ్రామాలపై అటవీ శాఖ దాడుల తక్షణ నిలిపివేత:

- రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఆదివాసీ గిరిజన గ్రామాలపై అటవీ శాఖ అధికారుల దాడులు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. ఈ విపత్కర కాలంలో గిరిజన పోడు రైతులను, ఆదివాసీలను వేధించే దాడులను తక్షణమే నిలిపివేయాలి.దాడులకు తెగబడుతూ, భయాందోళనలకు గురిచేస్తున్న సంబంధిత అధికారులు, సిబ్బందిపై ప్రభుత్వం కఠినమైన చట్టపరమైన చర్యలు చేపట్టాలి.

11) పరిపాలనా పర్యవేక్షణ & నిధుల డిమాండ్:

- **గ్రామ పర్యవేక్షణ కమిటీలు:** గ్రామ సభలు నిర్వహించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. వ్యవసాయ అనుబంధ సంస్థల సంస్థల మధ్యన సమన్వయం ఏర్పాటు చేయాలి. గ్రామ స్థాయిలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, ఉద్యోగులతో కమిటీలు వేయాలి.
- **ఎంపీల్యాడ్స్ నిధులు:** పార్లమెంట్ సభ్యులు తమ ఎంపీల్యాడ్స్ నిధులను ఈ కరువు ప్రాంతాలకు కేటాయించాలి. రాష్ట్రం నుండి ఉన్న 17 మంది పార్లమెంట్ సభ్యులు ఎల్‌నినో తీవ్రతను కేంద్రానికి వివరించి అవసరమైన నిధులను కేంద్రం నుండి రాబట్టడానికి కృషి చేయాలి.
- **కేంద్ర & రాష్ట్ర ప్యాకేజీ:** ఎల్ నినో కరువు ఎదుర్కొనేందుకు కేంద్రం నుండి రూ. 50,000 కోట్ల ప్రత్యేక సహాయం సాధించడానికి అఖిలపక్ష బృందాన్ని రాష్ట్రప్రభుత్వం ఢిల్లీకి తీసుకెళ్లాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్షణమే కరువు ప్యాకేజీని ప్రకటించి విడుదల చేయాలి.

12) ప్రభుత్వ పరిపాలనా పొదుపు చర్యలు :

- ఈ విపత్కర పరిస్థితుల్లో అనవసరపు, ఆడంబర ప్రభుత్వ ఖర్చులను తక్షణమే నిలిపివేసి పొదుపు చర్యలు పాటించాలి. ఆ పొదుపు నిధులను కరువు బాధితుల ఉపశమనానికిమళ్లించాలి.
- మంత్రులు మరియు ఉన్నతాధికారుల కాన్వాయ్ ఖర్చులు, అనవసర పర్యటనలు, పత్రికా/మీడియాలో ప్రకటనల ప్రచార వ్యయం, అధికారిక విందులు, కొత్త విలాసవంతమైన వాహనాలు-ఫర్నిచర్ కొనుగోళ్లు, ప్రభుత్వ కార్యాలయాల దుబారా విద్యుత్, తదితర ఖర్చులు తగ్గించాలి.
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ తక్షణమే ఖాళీగా ఉన్న సొంత ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలి.

ప్రస్తుత ఎల్ నినో కరువు సంక్షోభం రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలు మరియు రైతుల జీవితాలను దెబ్బతీసే ప్రమాదం ఉన్నందున, పైన పేర్కొన్న ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) విజ్ఞప్తి చేస్తున్నది.

ధన్యవాదాలతో,

(జాన్‌వెస్లీ)

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి